క్లుప్తంగా

ఈద్గాకు మంచినీటి సౌకర్యం



ఈద్గా వద్ద బోరు వేయిస్తున్న ఫక్రుద్దీన్, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తదితరులు

ఓడీచెరువు: పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఈద్గా వద్ద మంచినీటి సౌకర్యం కల్పించారు. ఇటీవల రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గా వద్ద తాగునీటి సమస్యతో ముస్లింలు ఇబ్బందులు పడుతుండటాన్ని గమనించిన విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ మారగానికుంట్ల ఫక్రుద్దీన్ తాగునీటి వసతి కల్పిస్తానని హామీ ఇచ్చారు. దీంతో శుక్రవారం ఆయన ఈద్గా వద్ద తాగునీటి కోసం బోరు వేయించారు. బోరులో పుష్కలంగా నీరు లభించిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ముస్లింలు ఫక్రుద్దీన్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ మల్లికార్జున రెడ్డి, ముతవల్లి అల్లాబకష్, ముస్లిం సోదరులు పాల్గొన్నారు

'ఎంఈఓపై చర్యలొద్దు'

కదిరి అర్బన్: బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తున్న కదిరి ఎంఈఓ చిన్నిక్రిష్ణపై చర్యలు తీసుకోవద్దని మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు నాగేంద్రనాథ్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పదవ తరగతి పరీక్షల ఇన్విజిలేటర్ల నియామకంలో కొందరు ఎంఈఓపై అనవసరమైన ఆరోపణలు చేశారని తెలిపారు. ఉపాధ్యాయులు ఓబులేసు, కిష్టప్ప, రుద్రంరెడ్డి, రఫిపైనా విధించిన సస్పెన్షన్ ఎత్తేయాలని జిల్లా ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



వైద్య సేవలపై ఆరా తీస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ సెల్వియా సాల్మన్

చెన్నేకొత్తపల్లి: గ్రామీణ ప్రాంతాల్లోని రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ సెల్వియా సాల్మన్ వైద్య సిబ్బందికి సూచించారు. మండల పరిధిలోని వెల్దుర్తిలో శుక్రవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను ఆకస్మిక తనిఖీ చేశారు. దీర్ఘకాలిక రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం వైద్య సిబ్బందితో కలసి ఇంటింటికీ తిరిగి వైద్య సేవలు ఎలా అందుతున్నాయని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్ కుమార్, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాల వినియోగంపై తనిఖీ



ఉలవ దిగుబడులపై రైతులతో ఆరా తీస్తున్న ఏడీఏ రోజా పుష్పలత

ముదిగుబ్బ: గత ఖరీఫ్ సీజన్లో రైతులకు సబ్సిడీ కింద ప్రభుత్వం అందజేసిన ప్రత్యామ్నాయ విత్తనాల వినియోగంపై శుక్రవారం వ్యవసాయాధికారులు తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా భూసార పరీక్ష కేంద్రం ఏడీ రోజా పుష్పలత జొన్నలకొత్తపల్లి, సంకేపల్లి, ముదిగుబ్బలో ఆమె పర్యటించారు. మండలంలో 860 క్వింటాళ్ల ఉలవలు, 71 క్వింటాళ్ల పెసర విత్తనాలు సబ్సిడీపై అందజేశారు. వీటిని తీసుకున్న రైతుల్లో కొంత మంది పంటలు సాగు చేసుకోగా, మరికొంత మంది సాగు చేయలేదు. ఈసందర్భంగా ఏడీ పంట వేసిన రైతులతో వచ్చిన దిగుబడులపై ఆరా తీశారు. భూసార పరీక్షల ఆవశ్యకతపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల 'పల్లెనిద్ర'

కదిరి అర్బన్: సున్నపుగుట్టతండాలో శుక్రవారం రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐ నిరంజన్‌రెడ్డి తన సిబ్బందితో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. గ్రామంలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

తాగునీటి సమస్య తీర్చండి

ఎన్పీకుంట: మేకలచెరువు హరిజనవాడలో నీటి సమస్య తీర్చి, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు జయరాములు శుక్రవారం పంచాయతీ కార్యదర్శి ధనుంజయను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరిజనవాడలో సుమారు 60 కుటుంబాలు ఉన్నాయని, ఇక్కడ వాటర్ ట్యాంక్ మరమ్మతులకు గురవడంతో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. అలాగే వీధి దీపాలు కూడా లేవని తెలిపారు. పంచాయితీ అధికారులు గ్రామంలో పర్యటించి నీటి సమస్య పరిష్కరించి, మౌళిక వసతులు కల్పించాలని కోరారు. ఈ విషయమై పంచాయితీ కార్యదర్శి మాట్లాడుతూ గ్రామంలో పర్యటించి నాలుగు రోజుల్లో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

స.హ చట్టంపై అలసత్వం

- బోర్డులు ఏర్పాటు చేయని పలు శాఖల అధికారులు
- చట్టంపై ప్రజల్లో కొరవడుతున్న అవగాహన
- పాలకులు, అధికారుల తీరుతో కనుమరుగవుతున్న చట్టం



నల్లచెరువు సచివాలయం-2 వద్ద గతంలో పని చేసిన అధికారుల పేర్లున్న బోర్డు

నల్లచెరువు: పాలన పారదర్శకంగా జరగాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం సమాచార హక్కు చట్టం తీసుకొచ్చింది. అయితే క్షేత్రస్థాయిలో అధికారులు చట్టం అమలుపై అలసత్వం ప్రదర్శిస్తుండటంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది. ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించాల్సిన అధికారులే దీనిపై చిన్న చూపు చూస్తున్నారు. కొందరు అధికారుల అలసత్వం కారణంగా సమాచార హక్కు చట్టంపై నేటి యువతలో అవగాహన కొరవడుతోంది.

కార్యాలయాల్లో కనిపించని సమాచార బోర్డులు

సమాచార హక్కు చట్టం 2005 మే 25న అమల్లోకి వచ్చింది. ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలు, పథకాల అమల్లో అవినీతి, అక్రమాలను ఈ చట్టంతో అరికట్టే అవకాశం ఉంది. అయితే ఆయా కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టానికి సంబంధించి అధికారుల వివరాలతో బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో బోర్డులే కనిపించడం లేదు. ఈ బోర్డులో ఆయా కార్యాలయాల్లోని అప్పిలేట్ అధికారి పేరు ఫోన్ నంబర్ సహా వివరాలు తెలియ జేయాల్సి ఉన్నప్పటికీ ఆయా శాఖల అధికారులు ఇవేవీ పట్టించుకోవడం లేదు. చట్టం అమల్లోకి వచ్చినప్పుడు ఏర్పాటు చేసిన బోర్డులే తప్ప తర్వాత వచ్చిన వారి వివరాలను మార్పు చేయకుండా అలాగే వదిలేస్తున్నారు

తప్పులు బయట పడతాయనే..

సమాచార హక్కు చట్టంపై పూర్తి స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తే తాము చేసిన శాఖాపరమైన తప్పులు బట్టబయలు అవుతాయనే భయం కొందరు అవినీతి అధికారుల్లో ఉంది. మరోవైపు ఎక్కడ పనిభారం పెరుగుతుందో అనే ఉద్దేశంతో కూడా కొందరు అధికారులు ఈ చట్టానికి తూట్లు పొడుస్తున్నట్లు విమర్శలున్నాయి. సమాచారం హక్కు చట్టంపై పౌరులు కోరే సమాచారాన్ని నిర్ణీత సమయంలో అధికారులు అందజేయాల్సి ఉంటుంది. ఇది అధికారులకు ఇబ్బందులు కలిగిస్తుంది. అందుకే ఈ చట్టంపై సంబంధిత అధికారులు ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక నల్లచెరువు మండలంలోని ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచారాన్ని కోరే దరఖాస్తు ఫారాలు కూడా అందుబాటులో లేకపోవడం గమనార్హం.

అవగాహన చాలా అవసరం



సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్య పరచడం చాలా అవసరం. కేవలం అవినీతి అధికారుల కోసమే ఈ చట్టం కాదు. సామాన్యుడి చేతిలో అస్త్రం వంటి ఈ చట్టంతో భారీ అవినీతి కుంభకోణాలు వెలుగు చూసిన సందర్భంగా ఎన్నో ఉన్నాయి. ప్రభుత్వ పథకాల్లో అవతవకలను ఈ చట్టం ద్వారా వెలికి తీయొచ్చు.

– ఎస్. సోమశేఖర్‌రెడ్డి, ఆర్టీఐ జిల్లా ఉపాధ్యక్షుడు

బోర్డులు ఏర్పాటు చేయాలి



ఈ చట్టాన్ని ఎవరూ లాభాపేక్ష కోసం ఉపయోగించడం తగదు. కొందరు అధికారులు ఈ చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలి. కార్యాలయాల వద్ద ఈ చట్టానికి సంబంధించిన బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేసేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

– రామకృష్ణ, సీఐటీయూ మండలాధ్యక్షుడు, నల్లచెరువు

హెలీప్యాడ్‌కు స్థల పరిశీలన



ఎన్ఎస్‌గేట్ వద్ద హెలిప్యాడ్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న తోపుదుర్తి రాజశేఖరరెడ్డి

చెన్నేకొత్తపల్లి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈనెల 8వ తేదీన రామగిరి మండలం పాపిరెడ్డిపల్లికి రానున్నారు. పాపిరెడ్డిపల్లికి చెందిన కురుబ లింగమయ్య ఇటీవల టీడీపీ నాయకుల దాడిలో గాయపడి మృతి చెందిన విషయం తెలిసిందే. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు వైఎస్ జగన్ రానున్నారు. శుక్రవారం హెలికాప్టర్ ల్యాండింగ్ కోసం ఎన్ఎస్ గేట్ ప్రాంతంలో స్థలాన్ని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోదరుడు, పార్టీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖరరెడ్డి స్థానిక నాయకులతో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో చెన్నేకొత్తపల్లి మండల కన్వీనర్ డోలా రామచంద్రారెడ్డి,నాయకులు ఎస్టీడీ శ్రీనివాసరెడ్డి,రమణ, కిష్టతో పాటు రామగిరి మండలం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

కదిరి టౌన్: పట్టణానికి చెందిన ఓ యువతి అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. అడపాలవీధిలోని పోస్టాఫీస్ సమీపంలో నివాసం ఉంటున్న పసుపులేటి అర్షిత కదిరి కోర్టు ఎదురుగా సిద్ధిక్ గార్మెంట్స్‌లో సేల్స్ గర్ల్‌గా పని చేసేది. గురువారం యథావిధిగా షాపునకు వచ్చిన ఆమె తర్వాత ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా వెతికినా ప్రయోజనం లేకపోయింది. దీంతో శుక్రవారం ఆమె తల్లి భాగ్యమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసి యువతి కోసం గాలింపు చేపట్టినట్లు పట్టణ సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు.

నేటి నుంచి బోస్ ముత్తాతస్వామి ఉత్సవాలు

తలుపుల: మండలంలోని సిద్దుగూరిపల్లిలో వెలిసిన బోస్ ముత్తాత స్వామి ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నట్లు పూజారి ప్రసాద్‌రెడ్డి, గ్రామస్తులు తెలిపారు. శనివారం సాయంత్రం 7 గంటలకు కొండపై దీపాలు వెలిగించడం, గొడుగులు మెరవణి, ఆదివారం సత్యమ్మ గుడి వద్ద బోనాల కార్యక్రమం, కోలాటాలు ఉంటాయన్నారు. అలాగే సోమవారం ఉదయం ఎడ్లబండ్లు తిరిగే కార్యక్రమం, అదే రోజు రాత్రికి శ్రీకృష్ణార్జున యుద్ధం డ్రామా, కొమ్మకూడు కార్యక్రమం, మంగళవారం తెల్లవారుజామున అగ్గిసేవ కార్యక్రమంతో ఉత్సవాలు ముగిస్తాయని తెలిపారు.

కూటమి ప్రభుత్వానికి పాలించే అర్హత లేదు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: ఎన్నికల హామీలను అటకెక్కించిన కూటమి ప్రభుత్వానికి పాలించే అర్హత లేదని పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం పుట్టపర్తి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కొత్తచెరువు మండలం పార్టీ శ్రేణుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నా సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయలేదన్నారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేసి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. తద్వారా కూటమి ప్రభుత్వాన్ని గద్దె దింపుదామని పిలుపునిచ్చారు.

జగన్ 2.0లో కార్యకర్తలు మెచ్చే పాలన..

2019 నుంచి 2024 వరకు మొదటిసారి సీఎం అయిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి సంక్షేమ రాజ్యస్థాపనకు శ్రీకారం చుట్టారని, ఈ సారి సీఎం అయితే కార్యకర్తలు మెచ్చేలా పాలన అందిస్తారని దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి చెప్పారు. పార్టీతోపాటు ప్రజలకు సమన్యాయం చేస్తానని ఇప్పటికే జగనన్న ప్రకటించారని గుర్తు చేశారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల కమిటీలను పునర్వ్యవస్థీకరిస్తున్నట్లు ప్రకటించారు. ఆయా మండలాల నుంచి కార్యకర్తలే కమిటీ ఎంపిక చేస్తారన్నారు. కార్యక్రమంలో తలమర్ల సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, తలమర్ల మాజీ సర్పంచ్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు నారాయణ, మాజీ సర్పంచ్ కొడపగానిపల్లి రఘునాథరెడ్డి, వాల్మీకి శంకర్, ఎల్లప్ప భాస్కర్, ఎంపీటీసీలు, సర్పంచులు, బూత్ లెవల్ కన్వీనర్లు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నాణ్యమైన కాయలకు అధిక ధర



మామిడి కాయల నాణ్యతపై వివరిస్తున్న అగ్రి పార్క్ ఇన్నోవా ప్రతినిధులు

పుట్టపర్తి: మామిడి కాయలు నాణ్యంగా ఉంటే అధిక ధరకు కొనుగోలు చేస్తామని అగ్రి పార్క్ ఇన్నోవా ప్రతినిధి బందం సభ్యులు అన్నారు. వారు శుక్రవారం హెచ్ఓ నవీన్, సిబ్బందితో కలిసి బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారిపల్లి సమీపంలో రైతు ఆవుటాల ఓబిరెడ్డి సాగు చేసిన మామిడి తోటతో పాటు కొత్తకోట తదితర ప్రాంతాల్లో తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాయల నాణ్యంగా ఉంచుకోవాలని సూచించారు. ఇండియా నుంచి నాణ్యంగా ఉన్న కాయలను అమెరికా లాంటి దేశాలకు ఎగుమతి చేస్తామన్నారు. తాము ఎలాంటి తరుగు, కమిషన్ లేకుండా కాయలు కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో రైతు రవి ప్రసాద్‌రెడ్డి, సిబ్బంది సుధాకర్‌నాయక్, గీతా తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ సర్కార్‌వి మత రాజకీయాలు'



మాట్లాడుతున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఇనయతుల్లా

పుట్టపర్తి టౌన్: బీజేపీ ముస్లింలకు 8 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే ఆ పార్టీ జెండా మోస్తామని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎస్‌హెచ్ ఇనయతుల్లా, రాష్ట్ర ఉపాధ్యక్షులు కోటా సత్యం పేర్కొన్నారు. శుక్రవారం హనుమాన్ కూడలి వద్ద బహిరంగ సభలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ వైఎస్సార్ హయాంలో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించిందన్నారు. ప్రస్తుతం బీజేపీ హిందూ, ముస్లింలను వేరు చేసి మతరాజకీయాలు చేస్తోందని విమర్శించారు. వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. అనంతరం జిల్లా ఓబీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన ఎం.ధరణిని ఘనంగా సన్మానించారు. నాయకులు గౌస్‌బాషా, లక్ష్మీనారాయణ, మహేష్, నజీర్, గాంధీ, అష్రాఫ్, బాబు, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ నేత మృతి



బొమ్మయ్య (ఫైల్)

కనగానపల్లి: మండలంలోని మద్దెలచెరువు గ్రామంలో శుక్రవారం వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, పంచాయతీ వార్డు మెంబరు జీ.పీ.బొమ్మయ్య (68) గుండెపోటుతో మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన బొమ్మయ్యకు గురువారం రాత్రి ఆకస్మాత్తుగా గుండెపోటు వచ్చింది. కుటుంబ సభ్యులు అతడిని వెంటనే అనంతపురంలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న వైఎస్సార్‌సీపీ నాయకురాలు గంగుల భానుమతి, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు శుక్రవారం గ్రామానికి వచ్చి బొమ్మయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ



ఆటో డ్రైవర్‌ను సన్మానిస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు

ధర్మవరం రూరల్: తన ఆటోలో దొరికిన సెల్‌ఫోన్‌ను పోలీసులకు అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు ఓ ఆటో డ్రైవర్. వివరాలు..మండలంలోని కుణుతూరు గ్రామానికి చెందిన బాబావలి తన స్వగ్రామం నుంచి ధర్మవరానికి ప్రయాణికులను తరలిస్తుంటాడు. ఇందులో భాగంగా శుక్రవారం ఆటోలో ధర్మవరానికి చేరుకున్నాడు. ప్రయాణికులు దిగిపోయిన తర్వాత ఆటోలో సెల్‌ఫోన్ కనిపించడంతో వెంటనే దాన్ని ధర్మవరం రూరల్ పోలీసులకు అప్పగించాడు. సెల్‌ఫోన్ దేవదాయ శాఖ అధికారికి చెందినదిగా గుర్తించిన పోలీసులు దాన్ని సదరు అధికారికి అందజేశారు. ఈసందర్భంగా ఆటో డ్రైవర్‌ను ఎస్ఐ శ్రీనివాసులు ఘనంగా సన్మానించారు.

అన్నదాన కార్యక్రమానికి విరాళం



విరాళం ఇస్తున్న దాత సత్యనారాయణ

ధర్మవరం రూరల్: ధర్మవరంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో నిత్యాన్నదానానికి రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఎలుగోటి సత్యనారాయణప్ప శుక్రవారం రూ.3 లక్షలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతను షిర్డీసాయిసేవా సమితి వారు ఘనంగా సన్మానించారు. సమితి అధ్యక్షుడు వీరనారాయణ, కార్యదర్శి రామలింగయ్య, ఉపాధ్యక్షుడు టీసీ నారాయణ, డైరెక్టర్ సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శ్రీరామనవమి వేడుకలు

బత్తలపల్లి: పోట్లమర్రి గ్రామంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు శ్రీరామనవమి వేడుకలు నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం నుంచి వేడుకలు ప్రారంభమవుతాయని సీతారామాంజనేయస్వామి ఆలయ అర్చకులు కొమందూరు మారుతి ప్రసాద్, రమేష్, సాయికృష్ణ చెప్పారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఆలయంలో విశేష పూజలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. 7వ తేదీ వనభోజ కార్యక్రమం, 8వ తేదీ గ్రామంలోని నలలమ్మ తల్లికి బోనాలు, జంతుబలులు సమర్పణ ఉంటాయని వివరించారు.

45.6 మి.మీ వర్షపాతం నమోదు



సుబ్బరాయనిపల్లిలో వర్షపాతాన్ని కొలుస్తున్న కమిటీ సభ్యులు

చెన్నేకొత్తపల్లి: మండలంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకూ భారీ వర్షం కురిసింది. ఉక్కపోతతో అల్లాడిపోతున్న ప్రజలకు కాస్త ఉపశమనం లభించింది. మండల వ్యాప్తంగా 45.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ రంగారెడ్డి తెలిపారు. టింబక్టు కలెక్టివ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాయలసీమ వాటర్ ప్రాజెక్ట్ కింద మండలంలోని గువ్వలగొందిపల్లి, సుబ్బరాయనిపల్లి, కునుముక్కల గ్రామాల్లో రెయిన్ గేజ్‌లను ఏర్పాటు చేసినట్లు ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీకాంత్, కో–ఆర్డినేటర్ రవి తెలిపారు. గ్రామాల్లో కురిసే వర్షపాతాన్ని జన చైతన్య సమాఖ్య సభ్యులు కొలుస్తారన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

తాడిమర్రి: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం లభిస్తుందని వైద్య సిబ్బంది పేర్కొన్నారు. శుక్రవారం తాడిమర్రి, పిన్నదరి, కునుకుంట్ల, దాటితోట, ఎం, అగ్రహారం, పెద్దకోట్ల, నార్సింపల్లి తదితర గ్రామాల్లో డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు కోమలి, క్రిష్ణమ్మ, సుగుణ, లక్ష్మీకాంతం, ఆరోగ్య కార్యకర్తలు హర్షవర్ధన్‌రెడ్డి, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

కదిరి టౌన్: అదనపు కట్నం కేసు వేధిస్తున్న భర్త, ఆడపడుచు, ఆమె భర్తపై పోలీసులు వరకట్న కేసు నమోదు చేశారు. వివరాలు.. పట్టణంలోని ఓల్డ్ మేదర వీధిలో నివాసం ఉన్న షేక్ రుహినాజ్‌కు ఏడాది క్రితం బెంగళూరుకు చెందిన మెకానిక్ షేక్ మహమ్మద్ వసీం అక్రంతో పెళ్లి జరిగింది. పెళ్లి సమయంలో 9 తులాల బంగారం ఆభరణాలు కట్నంగా ఇచ్చారు. పెళ్లయిన ఆరు నెలల నుంచి భర్త, ఆడపడుచు తసీన్, ఆమె భర్త జాఫర్ బాషాలు అదనపు కట్నం ఇవ్వమని ఆమెను శారీరకంగా, మానసికంగా వేధించసాగారు. వేధింపులు తట్టుకోలేక శుక్రవారం ఆమె పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పై ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ధర్మవరం రూరల్: గ్రామీణ ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ధర్మవరం రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు ప్రజలకు సూచించారు. శుక్రవారం రాత్రి ఆయన తుమ్మల, మల్లేనిపల్లిలో సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో గొడవలకు దూరంగా ఉండి ప్రశాంత వాతావరణంలో జీవించాలన్నారు. మద్యానికి బానిసలు కావొద్దని సూచించారు. మహిళలపై జరుగుతున్న నేరాల పట్ల అవగాహన కల్పించారు.

సంక్షిప్త సమాచారం

విద్యార్థినులకు ఇంటర్న్‌షిప్

ధర్మవరం రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థినులకు వేసవి సెలవుల్లో భాగంగా సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ఇంటర్న్‌షిప్ నిర్వహించనున్నారు. ఈమేరకు పాఠశాల హెచ్ఎం సుమన, ఒకేషనల్ టీచర్లు కళ్యాణి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. యాపిరల్ అండ్ మేడ్‌అప్స్, బ్యూటీ వెల్నెస్‌పై పది రోజుల పాటు శిక్షణ ఇస్తామని తెలిపారు.

ముస్లింల ద్రోహి చంద్రబాబు

కదిరి అర్బన్: పార్లమెంటులో వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతిచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబు ముస్లింల ద్రోహిగా నిలిచిపోయారని కాంగ్రెస్ కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ షాన్‌వాజ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్‌తో సహా మొత్తం ఇండియా కూటమి బిల్లును వ్యతిరేకిస్తే చంద్రబాబు మద్దతు పలకడం క్షమించరానిదన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు మనసు మార్చుకుని బిల్లుకు ఇచ్చిన మద్దతును ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో రాబోవు ఎన్నికల్లో ముస్లింల తడాఖా చూపిస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు అల్లాబకష్, హైదర్‌వలీ, జబీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి ఊరేగింపు

అమడగూరు: చౌడేశ్వరీ అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సోలకుంట్లపల్లిలో అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని యువకులంతా అమ్మవారి పల్లకీని ఎత్తుకుని ఉల్లాసంగా పురవీధులన్నీ తిరిగారు. డప్పు, వాయిద్యాల నడుమ అమ్మవారికి ప్రతి ఇంటి ముంగిటకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. కోర్కెలు నెరవేర్చుకున్న భక్తులంతా అమ్మవారికి వడివేలును సమర్పించారు. ఊరేగింపు అనంతరం అమ్మవారిని మామిడి మాకులపల్లికి తీసుకెళ్లారు.

తల్లిదండ్రులకు యువతి అప్పగింత

బత్తలపల్లి: తల్లిదండ్రులు వివాహ ప్రయత్నాలు చేస్తున్నారని ఇంటి నుంచి వెళ్లిపోయిన యువతిని పోలీసులు శుక్రవారం ఆమె తల్లిదండ్రులకు అప్పగించారు. శుక్రవారం ఎస్ఐ సోమశేఖర్ తెలిపిన సమాచారం.. రామాపురం గ్రామానికి చెందిన యువతి ఇది వరకే మేనమామతో వివాహం కాగా ఇద్దరి మధ్య మనస్పర్థలతో కోర్టు ద్వారా విడాకులు పొందింది. ప్రస్తుతం అనంతపురంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. తల్లిదండ్రులు ఆమెకు మళ్లీ వివాహం చేయాలని ప్రయత్నాలు ప్రారంభించారు. ఇది ఇష్టం లేని యువతి గత నెల 22న ఆధార్‌కార్డు, సర్టిఫికెట్లు జిరాక్స్ చేసుకుని వస్తానంటూ ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సెల్ టవర్ లోకేషన్ ఆధారంగా యువతిని గుర్తించి తీసుకొచ్చారు. తహసీల్దార్ సమక్షంలో యువతిని ఆమె తల్లిదండ్రులకు అప్పగించారు. మిస్సింగ్ కేసును ఛేదించిన కానిస్టేబుల్ సుదర్శన్‌నాయుడు, అనిల్‌కుమార్, హోంగార్డు అస్మాను ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, ఎస్ఐ సోమశేఖర్ అభినందించారు.